## క్లుప్తంగా

### శాశ్వత వంతెన నిర్మాణానికి కృషి



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట నుంచి చెన్నంపల్లె వరకు స్వర్ణముఖి నదిపై శాశ్వత వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ద్వారా కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. బుధవారం తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న చెన్నంపల్లి సమీపంలోని నక్కలవంక వాగు రోడ్డును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### పారిశుధ్య సేవలు భేష్

శ్రీకాళహస్తి: పట్టణంలో ఏడు గంగమ్మల జాతర నేపథ్యంలో పారిశుధ్యంపై కమిషనర్ రమేష్ బాబు ప్రత్యేక దృష్టి సారించారు. భేష్ అనేలా పారిశుద్ధ్య కార్మికులు సేవలు అందించారు. వేకువజామున జాతర ఊరేగింపు ప్రారంభమై ఆయా ప్రాంతాల్లో అమ్మవార్లు కొలువుదీరి, నిమజ్జనం జరిగేంత వరకు కార్మికులు విస్తృత సేవలను అందించారు. అమ్మవార్లు కొలువైన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు శుభ్రత పనులు చేపట్టారు. వీధులను తక్షణం శుభ్రం చేయడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### పీహెచ్‌సీ భవనంపై కూలిన చెట్లు



వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భారీ వర్షాలకు ప్రాంగణంలోని భారీ వృక్షాలు కూలాయి. దీంతో రెండు చోట్ల ప్రహరీ గోడ పగుళ్లుబారింది. భవనం స్వల్పంగా దెబ్బతినింది. వివరాలను ప్రభుత్వానికి నివేదించినట్లు వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు.

### లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: ఈనెల 9వ తేదీ పట్టణంలోని న్యాయస్థాన భవనంలో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేద్దామని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. పట్టణంలోని న్యాయస్థాన భవనంలో బుధవారం న్యాయమూర్తి మాట్లాడుతూ శనివారం జరగనున్న జాతీ య లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. పోలీసు, రెవెన్యూ, బ్యాంకు అధికారులు ఈమేరకు కక్షిదారులకు అవగాహన కల్పించి పెద్ద సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని సూచించారు. అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయమూర్తు లు బేబీరాణి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ఏర్పేడు: మండలంలోని సరస్వతికండ్రిగలో విద్యుత్ షాక్‌తో బుధవారం ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన తంబయ్య ఆవులను మేతకోసం శ్మశానం వద్దకు తోలుకుని వెళ్లాడు. అక్కడ ఒక ఆవు మేత మేస్తుండగా విద్యుత్ వైర్ తగలి షాక్‌కు గురై మృతిచెందింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

### గ్రామాల్లో వైద్య శిబిరాలు

వరదయ్యపాళెం: వర్షాల కారణంగా గ్రామాల్లో తలెత్తిన పారిశుద్ధ్య ఇబ్బందులపై అవగాహన కల్పిస్తూ, గ్రామాల్లో విస్తృతంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కదూరు, నెల్లటూరు, మరదవాడ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

### 50 ఎకరాల పంటలో ఇసుక మేటలు



కళత్తూరు పంట భూముల్లో ఇసుక మేటలు

కేవీబీపురం: తుపాన్ కారణంగా పంట పొలాలను వరదనీరు ముంచెత్తడంతో మండలంలోని కళత్తూరు దళితవాడ రైతులకు చెందిన 50 ఎకరాల వేరుశనగ పంటలో ఇసుకమేటలు వేశాయి. ఎకరాకు రూ.20 నుంచి రూ.30 వేలు ఖర్చు చేసి పంట సాగు చేశామని, ఇసుకమేటలు కట్టి పైర్లు ఏర్లను తలపిస్తున్నాయని, అధికారులు నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలంను కూడా కలసి ఈమేరకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంట నష్టం అంచనా వేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపాలని ఆదేశించారు. రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

# అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం



సత్యవేడు: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగిపోవాలని, సమసమాజ స్థాపనకు ఎనలేని కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు అంబేడ్కర్ అశయ సాదనకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాగ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా , రాజకీయంగా ఎదగాలన్నారు. అనంతరం అన్నదానం చేశారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బందెల బాలయ్య, సురుటుపల్లె ఆలయ ఛైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బి. సోమశేఖర్, వైస్ ఎంపీపీలు వెంకటరత్నం, గురుప్రసాద్, రాబర్ట్, సంఘం నాయకులు ఎంపీ రవి, గోవిందస్వామి, జోసఫ్, శేఖర్, రూబెన్, పళణి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం, సామాజిక వర్గాల అభివృద్ధి కోసం అంబేడ్కర్ చేసిన సేవలు శ్లాఘనీయ మని తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, మున్నా రాయల్, యానాదిసంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, పసల సురేష్, గాదిపాకుల కిరణ్, ఫజల్, గోరా, ముద్దమూడి రవి, ప్రమీల, దీపిక, జయశ్రీ, ప్రసాద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణవనంలో..**

నారాయణవనం: స్వతంత్ర్య భారతానికి దశ, దిశను నిర్దేశించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నారాయణవనం బైపాస్ వైఎస్సార్ కూడలి వద్ద అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీలు, ఎస్టీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగి, సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషించినపుడే అంబేడ్కర్ కలలు నెరవేర్చిన వారమవుతామని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, నాయకులు ఏకాంబరం, అన్నాదొరై, చిన్నదొరై, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**ఏర్పేడు మండలంలో..**

ఏర్పేడు: ఏర్పేడులో అంబేడ్కర్ సంఘం నాయకులు వాసుదేవులు, గురవమ్మ, నచ్చునేరిలో పత్రా సిద్ధయ్య, వికృతమాలలో ఐతేపల్లి గురునాథం, సీతారాంపేటలో సునీల్, పెన్నగడంలో శ్రీధర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం నాయకులు శంకరయ్య, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల నాయకుడు, మాజీ సర్పంచ్ గురవయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవకుమార్, దశకుమార్, మల్లికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు. కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాదెండ్ల మురళి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజాలి ఘటించారు.

**పిచ్చాటూరు మండలంలో..**

పిచ్చాటూరు : పిచ్చాటూరు, నీరువాయి, కారూరు, గోవర్ధనగిరి గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూధన్ రావు శ్రద్ధాంజలి ఘటించారు. అంబేడ్కర్ జాతికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన దార్శనీకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ సుగప్రియ, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి



ఏర్పేడులో అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకుల నివాళి



పిచ్చాటూరు : గోవర్ధనగిరిలో వైఎస్సార్ సీపీ నాయకుల నివాళి

# గంగమ్మ తల్లి ..చల్లంగ దీవించు



అభిషేక పూజల్లో పాల్గొన్న అంజూరు తారక శ్రీనివాసులు, డీఎస్పీ భీమారావు, సీఐ అంజుయాదవ్

శ్రీకాళహస్తి: గంగమ్మతల్లి చల్లని దీవెన ప్రజలకు శ్రీరామరక్ష అని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. బుధవారం జాతరను పురస్కరించుకుని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట కలశ స్థాపన పూజలు నిర్వహించి, వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అమ్మవారికి అభిషేక సేవ దర్శించుకునే భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ భీమారావు, 1వ పట్టణ సీఐ అంజుయాదవ్, స్వర్ణమూర్తి, అంజూరు బాలసుబ్రహ్మణ్యం, పగడాల రాజు, మొగరాల గణేష్, పెంచలయ్య, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

**భక్తులకు అంబలి పంపిణీ**

జాతర సందర్భంగా గాంధీ వీధి గంగమ్మ వద్ద కొళ్లూరు హరినాథ్‌నాయుడు భక్తులకు అంబలి పంపిణీ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని భక్తులకు అందజేశారు.

**గంగమ్మా..రక్షమాం**

పట్టణంలో ఏడుగంగమ్మల జాతర బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవార్లు ఆయా స్థానాల్లో కొలువుదీరారు. భక్తులు తెల్లవారు జామునే తల స్నానమాచరించి, నూతన వస్త్రాలు ధరించి ఇళ్లలో పలు రకాల వంటలను చేశారు. అనంతరం భక్తులు ఆహార పదార్థాలను అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు. కొందరు భక్తులు వెయ్యికళ్ల దుత్తలతో వచ్చి ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ వేషధారణలతో కొందరు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పల సంఘాలు అంబలి పంచాయి.



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

**గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ**

పట్టణంలోని ఏడుగంగమ్మ జాతర సందర్భంగా కొత్తపేట, కోనేరు వద్ద కొలువుదీరిన గంగమ్మలను రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోకవర్గ ప్రజలకు అమ్మవారిచల్లని దీవెనలు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కమిషనర్ రమేష్‌బాబు, నాయకులు రత్నంరెడ్డి, కంఠా ఉదయ్, మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, హరి పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



భక్తులకు అంబలి పంచుతున్న నిర్వాహకులు

## ఎడమ తూము కాలువను బాగు చేయాలని వినతి



గేట్లను పరిశీలిస్తున్న సుమన్‌కుమార్

పిచ్చాటూరు: నాగలాపురం మండలంలోని 3,500 ఎకరాలకు నీరందించే ఎడమ తూము కాలువ వరద ధాటికి రెండు చోట్ల కోతకు గురైంది. ఉదయం గేట్ల వద్దకు చేరుకున్న జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డికి కృష్ణాపురం సర్పంచ్ మహేంద్రన్, రైతులు కాలువను బాగు చేయాలని వినతిపత్రం సమర్పించారు. స్పందించిన సుమన్‌కుమార్ ఈఈ మదన గోపాల్‌తో మాట్లాడి వెంటనే కాలువకు మరమ్మతు పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. ఇందుకు ఈఈ సానుకూలంగా స్పందించినట్లు సుమన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పల్లి కొండేశ్వరాలయ పాలక మండలి సభ్యులు ఎస్ఎం సురేష్, సచివాలయ కన్వీనర్ దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముంపువాసులకు ఆర్థిక సాయం



మరదవాడలో ముంపువాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

వరదయ్యపాళెం: తుపాన్ కారణంగా మండలంలో ముంపునకు గురై పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందజేయనున్నట్లు తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. బుధవారం మండలంలోని మరదవాడ, మావిళ్లపాడు ప్రాంతాల్లో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజుతో కలసి తహసీల్దార్ పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఇళ్లలోకి వర్షపునీరు చేరి జీవనం కోల్పోయిన వారిని కూడా 21 కాలనీల్లో గుర్తించారు. మండలంలో ఏర్పాటు చేసిన 8 పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితులకు ఆర్థికసాయం, నీరు చేరిన 21 కాలనీల వారికి నిత్యవసర సరుకులు గురువారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. మండలంలో మృతి చెందిన మూడు పశువులకు సంబంధించి పాడి రైతులకు ఆర్థికసాయం అందజేసేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేశామన్నారు. దెబ్బతిన్న పూరిళ్ల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

# దెబ్బతిన్న పంటల పరిశీలన



వరదయ్యపాళెం: కాంబాకంలో పంటను పరిశీలిస్తున్న ఏఓ



పిచ్చాటూరు: నీరువాయిలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ఏర్పేడు: తుపాన్ ప్రభావంతో ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అరటి, బొప్పాయిలో వేర్లు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సిక్లోరోఫైడ్‌ను చెట్టు మొదలుకు పోసుకోవాలని సూచించారు. నష్టాన్ని అంచనా వేసి నివేదికలు పంపుతామన్నారు. ఉద్యాన అధికారి పుష్పలత, సౌమ్య, తరుణ్ పాల్గొన్నారు.

**సస్యరక్షణతో ఆశించినన్ని పిలకలు**

వరద ప్రభావంతో దెబ్బతిన్న వరిలో సస్యరక్షణతో ఆశించినన్ని పిలకలు వస్తాయని రాస్ కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త జాన్ అన్నారు. బుధవారం మండలంలోని నచ్చునేరి, నాగంపల్లి, దుర్గిపేరి వ్యవసాయ పొలాలలో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరినాట్లును పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు. రాస్ కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్తలు లత, హేమావతి, ఏఓ షణ్ముగం పాల్గొన్నారు.

**పిచ్చాటూరులో శాస్త్రవేత్తల పర్యటన**

పిచ్చాటూరు: మండలంలోని నీరువాయి, రామాపురం, ఎస్ఎస్‌బీ పేట గ్రామాల్లో తుఫాను కారణంగా ముంపుకు గురైన పంట లను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి వేణు గోపాల్ సస్యరక్షణ చర్యలను వివరించారు. వరి పంటలో ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలని సూచించారు. పిలక దశలో ఉన్న వరి, చిన్న వయసులో ఉన్న వేరుశెనగ, ఉద్దులు పంటలకు ఎకరాకు 30 కేజీల చొప్పున యూరియా, 20 కేజీల పొటాష్ వేయాలన్నారు. పంటపొలాల్లో నీరు తీసివేసిన వెంటనే రోగాలు రాకుండా ఎకరాకు హెక్సాకోనజోల్ 400 మిల్లీ లేదా సాఫ్ 400 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు ఏఓ సంజీవ రెడ్డి, శాస్త్రవేత్తలు భాస్క ర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

**పంట నష్టం అంచనాలోఅధికారులు**

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, కాంబాకం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి సుహార్‌లత నీట మునిగిన వరి పైరును పరిశీలించారు. 29 గ్రామ పంచాయతీల్లో ఆర్బీకే సిబ్బంది పంట నష్టం గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రాథమికంగా 2,500 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.

## క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో తిరుపతి టాటా ట్రస్ట్, రాస్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ వెంకయ్య క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాస్ పొదుపు సంఘాల సభ్యులు, రాస్ మత్స్యకారుల పునరావాస కేంద్రంలోని మత్స్య కారులు, సిబ్బందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ డైరెక్టర్లు బాలాజీరెడ్డి, అన్నాదొరై, డాక్టర్ వెంకయ్య, ప్రోగ్రాం మేనేజర్ హేమంత్‌కుమార్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు

సత్యవేడు: తుపాన్‌కు మండలంలోని ఏఎంపురం చెరువు కలుజు ఉధృతంగా ప్రవహించడంతో వీఆర్ కండ్రిగ వద్ద కొట్టుకు పోయిన తాత్కాలిక వంతెన పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. రెండు రోజుల కిందట వంతెనకు అమర్చిన తూములు కొట్టుకు పోవడంతో సత్యవేడు–తిరుపతి బస్సు సర్వీసులు రద్దు అయ్యాయి. ఎమ్మెల్యే ఆదిమూలం స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులను త్వరితగతిన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెన పునరుద్ధరణ పనులు చేపట్ట ఒక్కరోజులో వాహనాల రాకపోకలకు రోడ్డు మార్గాన్ని సిద్ధం చేశారు. ఎమ్మెల్యే రోడ్డు పనులను పరీక్షించారు. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఆర్ అండ్‌బీ ఏఈ ఇబ్రాయిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మునివేలు, శ్రీనివాసులు రెడ్డి, గురుప్రసాద్, ఆర్ఐ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

వరదయ్యపాళెం: మండలంలో కురిసిన భారీ వర్షాలు విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో దాదాపుగా 110 విద్యుత్ పోళ్ల నేలకూలి వైర్లు తెగిపోయాయి. మరో 10 వ్యవసాయ విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్లు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధించేందుకు మండల విద్యుత్‌శాఖ ఏఈ శివప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది వేగవంతంగా పనులు చేపడుతున్నారు. చిన్న పాండూరు, వరదయ్యపాళెం, బత్తలవల్లం, సంతవేలూరు సబ్‌స్టేషన్ల పరిధిలో 50శాతంకు పైగా గ్రామాలకు సరఫరాను పునరుద్ధించామని, మిగిలిన గ్రామాలకు రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందజేస్తామని శివప్రసాద్ తెలిపారు.

## కాళమనాయుడుపేటలో ఫ్యామిలీ డాక్టర్

సత్యవేడు: కాళమనాయుడుపేట సచివాలయం సమీపంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.గుణశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన వారికి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యసేవలందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటిని కాచి వడగట్టి తాగాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# తగ్గని వరద ఉధృతి



ధ్వంసమైన జంగాలపల్లి కలుజు



కుమ్మరిమిట్ట వద్ద కోసుకుపోయిన రోడ్డు

ఏర్పేడు: వర్షం తగ్గినా మండలంలోని పలు గ్రామాల్లో కాజ్‌వేలు, వాగులు, వంకలు వరద బుధవారం కూడా నీటితో పొంగి పొర్లాయి. కొత్తవీరాపురం, గోవిందవరం గ్రామాలకు సమీపంలోని స్వర్ణముఖి నదిపై ఉన్న కాజ్‌వేలు, అంజిమేడు సమీపంలోని బండమానివాగు, గుడిమల్లం సీతకాల్వ తదితర గ్రామాలకు అటవీప్రాంతాల నుంచి చెరువులకు నీటిని అందించే వరవ కాల్వలు నీటితో పొంగి పొర్లుతున్నాయి. జంగాలపల్లె చెరువు కలుజు ప్రవాహానికి కొట్టుకు పోయింది. గత ప్రభుత్వంలో ఓ టీడీపీ నాయకుడు నాసిరకంగా పనులు చేపట్టడంతో కలుజు కొట్టుకు పోయిందని స్థానిక రైతులు తెలిపారు. ఏర్పేడు, కోబాక చెరువులు నీటితో నిండుకుండడంతో చెరువుకట్టలకు ఎగువ భాగాన రైతులు గండ్లు కొట్టారు. గండ్లు నుంచి నీటి ప్రవాహం వ్యవసాయ పొలాలలో ప్రవహిస్తోంది. మోదుగుల పాలెం పంచాయతీ పరిధి కుమ్మరిమిట్ట సమీపంలో కోనకాల్వ వంతెనపై ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసం కావడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కోబాక, మాధవమాల, మోదుగులపాలెం, కందాడు, ముసలిపేడు, మన్నసముద్రం, చెల్లూరు తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. ఎస్పీడీసీఎల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు.

# తుపాన్ బాధితులకు తక్షణ సాయం అందాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలో తుపాన్ బాధితులను గుర్తించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. తుపాను నష్టాన్ని క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖాధికారులు గుర్తించి, సకాలంలో జిల్లా అధికారులకు నివేదించి, సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ వాగులు, వంకలు తెగి పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. నదుల ఉధృతికి కాజ్‌వేలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని తెలిపారు. తాత్కాలిక ఏర్పాట్లతో రాకపోకలను పునరుద్ధరించి, లోతట్టు కాలనీల్లో నివసిస్తున్న కుటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజన వసతిని కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీల ఆధ్వర్యంలో విషజ్వరాలు ప్రబలకుండా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి ప్రతి రైతుకు సాయం అందేలా కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గంలోని రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులు తక్షణం స్పందించి సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

**మట్టి తొలగింపు పనుల పరిశీలన**

పిచ్చాటూరు: మండలంలోని అప్పంబట్టు వద్ద అరుణానది బ్రిడ్జిపై మట్టి తొలగింపు పనులను ఎమ్మెల్యే ఆదిమూలం బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు యుద్ధప్రాతిపదికన శ్రమించి ఎక్కడా కరెంటు, తాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ అధికారులు కొట్టుకు పోయిన కాలువలకు తక్షణం మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు రమేష్ రాజు, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

# ఆపద వేళ ఆపన్నహస్తం



చింతలపాలెం ఎస్టీ కాలనీలో నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పలు ఎస్టీ కాలనీల్లోని 300 గిరిజన కుటుంబాలకు బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిత్యావసర సరకుల పంపిణీ చేశారు. తుపాన్ ప్రభావంతో చింతలపాలెం, పల్లం, పల్లంపేట, అముడూరు తదితర ఎస్టీ కాలనీలో గిరిజనులు పనులు లేక భోజనానికి ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందిన వెంటనే ఎస్టీ కాలనీవాసులకు కుటుంబానికి 15 రకాల నిత్యావసర సరకులను ఎమ్మెల్సీ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపాల్, బాలప్రసాద్ యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.